క్లుప్తంగా

సౌండ్ సిస్టం బహూకరణ



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని మాధవాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.15వేల విలువైన సౌండ్ సిస్టంను పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ మంగళవారం బహూకరించారు. కార్యక్రమంలో హెచ్ఎం స్నేహలత, ఉపాధ్యాయులు నాగయ్య, పరమాత్మచారి, బాపురెడ్డి, సుజాత, సౌభాగ్య, హైమావతి, మమత, వీరలక్ష్మి పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు

కురవి: ప్రభుత్వ బడులను నిర్వీర్యం చేసే విధానాలను వెనక్కి తీసుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిచింత విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం సీరోలు మండలం చింతపల్లి గ్రామంలో టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బొల్లం శ్రీనివాస్, అక్కినపల్లి బాబురావు, విద్యాసాగర్, సునీల్‌కుమార్, సింగం మనోహర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఎస్సైగా అరుణ్‌కుమార్



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ ట్రాఫిక్ ఎస్సైగా చీర్ల అరుణ్ కుమార్ విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు.

దిశ కమిటీ వైస్ చైర్మన్‌గా లాలూనాయక్



డోర్నకల్: దిశ కమిటీ వైస్ చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకుడు గుగులోత్ లాలూనాయక్ నియమితులయ్యారు. కేంద్ర పథకాల అమలు, నిధుల మంజూరు, కేంద్ర బడ్జెట్‌తో జిల్లాలో జరిగే పనులను దిశ కమిటీ పర్యవేక్షిస్తుంది.

మున్నేరు నీటిని మండలాలకు ఇవ్వాలి



గార్ల: మున్నేరు ప్రాజెక్ట్ నీటిని గార్ల, బయ్యారం, డోర్నకల్ మండలాలకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం గార్లలో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనను ఉద్దేశించి న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య మాట్లాడారు. ఈ ప్రదర్శనలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు బండారి ఐలయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జడ సత్యనారాయణ, నందగిరి వెంకటేశ్వర్లు, సక్రు, ఎస్.మనోహర్, గౌని భద్రయ్య, గౌని మల్లేష్, సీహెచ్.గణేష్ పాల్గొన్నారు.

ఇద్దరి రిమాండ్

గార్ల: మండలంలోని పెద్దకిష్టాపురం గ్రామానికి చెందిన రైతు గంగావత్ మోహన్ ఆత్మహత్య చేసుకున్న ఘటనలో కారకులైన ఇద్దరిని మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఎస్‌కె రియాజ్‌పాషా వెల్లడించారు. ఎస్సై కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గార్ల మండలం పెద్దకిష్టాపురం గ్రామానికి చెందిన రైతు గంగావత్ మోహన్ గత ఐదేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన గంగావత్ దస్మా వద్ద కొనుగోలు చేసిన భూమికి పట్టా చేయించాలని పలుమార్లు రెవెన్యూ కార్యాలయంకు రావాలని అడుగగా దస్మా పట్టా చేయించేందుకు రావడం లేదు. పెద్దమనుషులు చెప్పినా దస్మా పట్టా చేసేందుకు నిరాకరించింది. దీంతో మనస్తాపానికి గురైన గంగావత్ మోహన్ గత నెల 29న పొలం వద్దకు వెళ్లి గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈమేరకు పోలీసులు విచారణ జరిపి మోహన్ ఆత్మహత్యకు కారకులైన దస్మా, ఆమె కుమారుడు తిలక్ ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పోలీస్‌స్టేషన్ నుంచి నల్లబెల్లం మాయం

నెల్లికుదురు: పోలీస్‌స్టేషన్‌లో గుడుంబా బెల్లం మాయమైన కొంత సేపటికే పోలీసులు పట్టుకున్నారు. ఈసంఘటన నెల్లికుదురు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం చోటు చేసుకుంది. విశ్వసనీయ సమాచారం.. ప్రకారం కేసముద్రం మండలం బోడమంచి తండాకు చెందిన ఓ వ్యక్తి సోమవారం రాత్రి పోలీస్‌స్టేషన్‌లోని పాత బిల్డింగ్‌లో ఉన్న 5నుంచి 7బస్తాల గుడుంబా బెల్లంను ఆటోలో తీసుకెళ్లాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆటో వెంటపడి పట్టుకున్నారు. ఎస్సై చిర్ర రమేష్ బాబును వివరణ కోరగా పోలీస్‌స్టేషన్ నుంచి బెల్లం తీసుకెళ్లింది వాస్తవమే, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వర్షాకాలం.. వ్యాధులకాలం

- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు
- వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత అవసరం
- సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో అవగాహన

గూడూరు: వర్షాకాలం జూన్, జూలై, అగస్టు వరకు కొనసాగుతుంది. ఈ సీజన్‌లో మొదడువాపు, చికెన్ గున్యా, డెంగీ, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశాలు ఉంటాయి. ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించకపోతే ఈ వ్యాధుల బారినపడతారు. మనం చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే ఈ వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండవచ్చని వైద్యాధికారులు చెబుతున్నారు. వర్షాకాలం మొదలు మహబూబాబాద్, తొర్రూరు నియోజకవర్గాల్లోని పీహెచ్‌సీల పరిధిలో స్థానికంగా ఏఎన్ఎం, ఆశ, అంగన్‌వాడీ, ఎంఎల్‌హెచ్‌పీలతో కూడిన బృందాలను ఏర్పాటు చేశారు. వారు జిల్లాలోని 21 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, 173 ఆరోగ్య ఉపకేంద్రాల్లో



గూడూరు సీహెచ్‌సీలో జ్వర పీడితులు

నూ, ఒకటి డీఎంహెచ్ఓలోనూ 2 డిప్యూటీ డీఎంహెచ్ఓల్లోనూ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు. అన్ని ఆసుపత్రుల్లో రోగులకు వైద్యులు అందుబాటులో ఉంటున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

వర్షాకాలంలో మురుగు నీటి గుంతలు లేకుండా, ఇంటి చుట్టు పక్కల నీరు నిల్వకుండా చూసుకోవాలి. దోమలు, ఈగలు ఇళ్లలోకి రాకుండా కిటికీలకు, తలుపులకు, సన్నటి జాలీలు బిగించుకోవాలి. దోమ తెరలు వాడాలి. పందులను జనావాసాలకు దూరంగా ఉంచాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. వేడిగా ఉండే భోజనం చేయాలి. ఇంటి ఆవరణలో తాగిపడేసిన కొబ్బరి బోండాలు, వాడి పడేసిన టైర్లు ఉంచరాదు. ఇంట్లో కూలర్లలోని నీటిని మూడు రోజులకు ఒకసారి మార్చుకోవాలి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రతీ ఒక్కరు వ్యకిత గత పరిశుభ్రతతోపాటు ఇంటి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వర్షాకాలం మొదలు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి. ఎలాంటి నీరసం, జ్వరం అనిపించినా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. రాత్రి మొత్తం దోమ తెరలను ఉపయోగించి పడుకోవాలి. అన్ని రకాల జబ్బులకు మందులు అందుబాటులో ఉన్నాయి. **- రవి రాథోడ్, డీఎంహెచ్ఓ**

స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

మహబూబాబాద్ అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంధసిరిజ్యోతి బసు, పట్ల మధు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, ధర్నా చేశారు. స్కాలర్‌షిప్‌లు విడుదల కాకపోవడం వల్ల పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు విద్యార్థులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, గత ప్రభుత్వం లాగానే ప్రస్తుతం ఉన్న



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని మండిపడ్డారు. అనంతరం ఏఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నిక్షిప్త, గుండ్ల రాకేష్, కొలిపాక వీరేందర్, ఉదయ్, పవన్, గణేశ్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి



బాలికలకు పండ్లు పంపిణీ చేస్తున్న ఆర్ఎల్ఎం

డోర్నకల్: మైనారిటీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలల్లో భోజన విషయంలో నిబంధనలు పాటించాలని టీఎం మైనారిటీ సొసైటీ వరంగల్ రీజనల్ లెవల్ కోఆర్డినేటర్(ఆర్ఎల్‌సీ) డాక్టర్ జంగా సతీష్ ఆదేశించారు. స్థానిక మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాలలో మంగళవారం డాక్టర్ సతీష్ తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికలకు మెనూ ప్రకారం ఆరోగ్యకరమైన భోజనం వడ్డించాలని ఆదేశించారు. షెడ్యూల్ ప్రకారం విద్యాబోధన కొనసాగించాలని, బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు సయ్యద్ మగ్బూల్, సయ్యద్ అక్బర్, ప్రిన్సిపాల్ స్వప్న, తదితరులు పాలొన్నారు.

పార్టీకి నష్టం కలిగిస్తే ఉపేక్షించం

- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్

తొర్రూరు: కాంగ్రెస్ పార్టీకి నష్టం కలిగిస్తే ఎవరినైనా ఉపేక్షించబోమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యా నాయక్, యూత్ విభాగం రాష్ట్ర నాయకుడు నరేందర్ పవార్ అన్నారు. డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనుమాండ్ల తిరుపతిరెడ్డి నమ్మక ద్రోహిగా మారాడని, పార్టీకి వ్యతిరేకంగా ప్రకటనలు చేసే వారిపై చర్యలు తప్పవన్నారు. పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న మాజీ మండల అధ్యక్షుడు మేరుగు మల్లేశం, నాయకులు బిట్టిమళ్ల మహేష్, బాలు నాయక్, ఎద్దు మహేష్, వంశీకృష్ణ, ధర్మారపు శ్రీనివాస్, జినుగ రవీందర్‌రెడ్డిలను బహిష్కరిస్తున్నట్లు మండల అధ్యక్షుడు సుంచు సంతోష్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సోమేశ్వర్ రావు, సోమ రాజశేఖర్, మేకల కుమార్, మంగళపల్లి రామచంద్రయ్య, రవీందర్‌రెడ్డి, పింగిళి ఉష పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హామ్యానాయక్

30క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత



నిందితులను చూపిస్తున్న అధికారులు

నర్సింహులపేట: మండలంలోని పెద్దనాగారం శివారు అజ్మీరతండా పరిధిలో వరంగల్-ఖమ్మం హైవేపై అనుమానాస్పదంగా వాహనాల తనిఖీలో 30 క్వింటాళ్ల బెల్లం, 4.5క్వింటాళ్ల పటికను పట్టుకొని ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు తొర్రూర్ ఎక్సైజ్ సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పెద్దనాగారం పరిధిలో హైవేపై మంగళవారం వరంగల్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ నాగేశ్వర్‌రావు, ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అశోక్ లేలాండ్ వాహనంను తనిఖీ చేయగా, అందులో 30క్వింటాళ్ల బెల్లం, 4.5క్వింటాళ్ల పటిక, 30లీటర్ల సారాయిని పట్టుకున్నట్లు తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకొని విచారించగా తరలిస్తున్న లూనావత్ కోటేష్, హైదరాబాద్‌కు చెందిన రమేష్, సురేష్‌లను గుర్తించి వారిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సురేష్, రమణ, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లం లారీ పట్టివేత..!

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ తండా శివారులో నల్లబెల్లం లారీ పట్టుబడినట్లు విశ్వసనీయ సమాచారం. నల్లబెల్లం లారీని పోలీసులు అదుపులోకి తీసుకోగా ఆ వాహనంలో 200 బస్తాల వరకు నల్లబెల్లం ఉన్నట్లు గుర్తించగా నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నట్లు తెలిసింది.

రిజర్వేషన్‌పై బీజేపీ స్పష్టత ఇవ్వాలి

మహబూబాబాద్ అర్బన్: తెలంగాణలో ఉన్న బీజేపీ పార్టీ బీసీల 42శాతం రిజర్వేషన్‌పై తల ఒక మాట మాట్లాడుతున్నారని, రిజర్వేషన్‌పై స్పష్టత ఇవ్వాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుగు కుమార్ అన్నారు. సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించి, ఏఓకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా పెరుగు కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర బీజేపీ నాయకులు, ప్రధాని మోదీ దగ్గరికి వెళ్లి బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలుపరిచే విధంగా చేయకపోతే బీజేపీ ప్రజాప్రతినిధుల ఇళ్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రేషపల్లి నవీన్, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, జలగం ప్రవీణ్, తోట రమేష్, శివ, శ్రీను, సత్యం పాల్గొన్నారు.



ఏఓకు వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

యువతతోనే దేశాభివృద్ధి

తొర్రూరు: యువత నైపుణ్యాలు పెంపొందించుకోవాలని, వారితోనే దేశ భవిష్యత్ సాధ్యమని సంక్షేమ బాలికల గురుకులం ప్రిన్సిపాల్ విజయ రత్నమాల తెలిపారు. అంతర్జాతీయ యువ నైపుణ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మేరా యువ భారత్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్ కేంద్రంలోని సంక్షేమ బాలికల గురుకులంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లా యూత్ కోఆర్డినేటర్ బానోతు వీరన్న, వైస్ ప్రిన్సిపాల్ మౌనిక, అధ్యాపకులు ఆసియా తస్నీన్, బిందు, స్వరూప పాల్గొన్నారు.

ఇంట్లో చోరీకి యత్నం

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధి కిష్టాపురంలోని ఒకరి ఇంట్లో దొంగతనానికి యత్నించిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కిష్టాపురానికి చెందిన ఎస్కే.కరీమా అనే మహిళ తన ఇద్దరు పిల్లలు, అమ్మతో ఇంట్లో నిద్రిస్తుండగా, ఇదే మండలం ఇంటికన్నె గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తెల్లవారుజామున 2.30 గంటల ప్రాంతంలో ఆమె ఇంట్లోకి చొరబడ్డాడు. ఇంతలో నిద్రలేచిన కరీమా అతన్ని చూసి కేకలు పెట్టింది. దీంతో చుట్టుపక్కలున్న వారంతా అక్కడి చేరుకోగా, గమనించిన దొంగ అక్కడి నుంచిపరారయ్యాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: పట్టణంలోని యాదవ్ నగర్ ప్రాంతానికి చెందిన భూక్యా రామచంద్రు తన వ్యవసాయ భూమి చుట్టూ నిర్మించుకున్న ప్రహరీని కూల్చివేసిన వ్యక్తులపై కేసు నమోదు చేశామని టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి మంగళవారం తెలిపారు. జేసీబీ సహాయంతో గుగులోత్ సురేష్, గద్దం రోషన్, బొబ్బిలిశెట్టి శ్రీనివాస్, వేముల వెంకన్న, ధారావత్ రవి కలిసి ప్రహరీ కూల్చివేశారని రామచంద్రు ఫిర్యాదు చేశాడన్నారు.

రేపు వాహనాల వేలం

గూడూరు: మండల కేంద్రంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఈనెల 17వ తేదీ గురువారం ఉదయం 10గంటలకు గుడుంబా రవాణా కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలంపాట నిర్వహిస్తున్నట్లు సీఐ ఎస్.భిక్షపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సంక్షిప్త సమాచారం

సకాలంలో వేతనాలు అందించాలి

తొర్రూరు: మున్సిపల్ కార్మికులకు వేతనాలు సకాలంలో అందించాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి కోరారు. పలు కార్మిక సమస్యలపై టీయూసీఐ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వేల్పుల మహేందర్, నాయకులు రామస్వామి, సోమయ్య, నరసింహ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో కంటి పరీక్షలు

కురవి: మండలంలోని నేరడ మోడల్ స్కూల్‌లో మహబూబాబాద్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీ సత్య కంటి ఆసుపత్రి నేతృత్వంలో విద్యార్థులకు మంగళవారం కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ రెడ్డి నాయక్, ప్రిన్సిపాల్ వై.శ్రీకాంత్, మేనేజర్ దారావత్ బాలునాయక్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

కురవి: సీరోలు మండలం కాంపల్లి గ్రామంలో పంచాయతీ కార్మికుడు బొజ్జ బుచ్చాలు ఇటీవల మృతి చెందాడు. ఈమేరకు కిసాన్‌పరివార్ అధినేత భూపాల్‌నాయక్ రూ.5వేలను సంస్థ సీరోలు మండల బాధ్యుడు విష్ణునాయక్ ద్వారా బాధిత కుటుంబానికి మంగళవారం అందజేశారు.

మొక్కలు నాటాలి

మరిపెడ రూరల్: ప్రతీ ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలని ఎంపీఓ సోమ్లానాయక్ అన్నారు. మంగళవారం మరిపెడ మండలం ఎడ్జెర్ల గ్రామంలో ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు.

హామీలను విస్మరించారు..

డోర్నకల్: ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను విస్మరించారని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె యాకూబ్ అన్నారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం యూటీఎఫ్ సభ్యత్వ నమోదు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జి.వివేక్, మండల అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ అజీజ్, శివప్రసాద్, రాముడు, సీతారామారావు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు పోరాడాలి

మరిపెడ: హక్కుల కోసం ముస్లింలు ఐక్యంగా పోరాడాలని రాజ్యాంగ పరిరక్షణ కమిటీ జాతీయ అధ్యక్షుడు సయ్యద్ సాధిక్ అలీ అన్నారు. సమస్యల పరిష్కారం కోసం మరిపెడలో జరిగిన జిల్లా స్థాయి సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ కృష్ణవేణికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జహంగీర్, అఫ్సర్, సయ్యద్ సర్వర్, యాకూబ్ పాషా, యాకూబ్‌జానీ పాల్గొన్నారు.

విచారణ జరిపించాలి

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారులు సిండికేట్‌గా రైతులను మోసం చేస్తున్నారని సిండికేట్ వ్యాపారులపై విచారణ జరిపించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి మంగళవారం డిమాండ్ చేశారు.

టై, బెల్టుల పంపిణీ

మహబూబాబాద్ అర్బన్: తెలుగు సమితి ఆఫ్ నేబ్రాస్కా, స్ఫూర్తి ఎడ్యుకేషన్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ జైపాల్ రెడ్డి సహకారంతో మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు టీ షర్ట్స్, టై, బెల్ట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్లు, రామసహాయం శ్రీధర్ రెడ్డి, హెచ్ఎంలు ప్రభావతి దేవి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల..

నెల్లికుదురు: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన ఉచిత విద్యతో పాటు ఉచిత, భోజనం, యూనిఫాం సకల సౌకర్యాలు అందుతున్నాయని ఎంఈఓ రాంమ్‌దాస్ అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో పాఠశాలలకు ఉచిత యూనిఫాం క్లాత్, విద్యార్థులకు నోట్ బుక్స్‌లను మంగళవారం అందించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు సుధాకర్, ఉపేందర్ పాల్గొన్నారు.

వేతనాలు అందించాలి

నెల్లికుదురు: ఆదర్శ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లకు 010 జీఓ కింద వేతనాలు అందించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిద్దోజు కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్‌ను మంగళవారం సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రమేష్, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు యాకన్న, శ్రీరాం, ప్రవీణ్, కుమార్, సంపత్ పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

గంగారం: నేడు విప్లవ పోరాట యోధుడు, రైతు సంఘాల ఆలిండియా కోఆర్డినేషన్ నాయకుడు రాయల చంద్రశేఖర్ వర్ధంతి వేడుకలను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ మహబూబాబాద్ డివిజన్ కార్యదర్శి పూణెం ప్రభాకర్ అన్నారు. మంగళవారం సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

సీపీఐ జిల్లా సమితి సభ్యుడిగా రషీద్

మరిపెడ: కురవిలో జరిగిన జిల్లా స్థాయి మహాసభలో మరిపెడకు చెందిన అబ్దుల్ రషీద్‌ను జిల్లా సమితి సభ్యుడిగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

బయ్యారం: మండలంలోని కంబాలపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని, పోడు సమస్యలు పరిష్కరించాలని పీసా కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు.

నామినేటెడ్ పదవికి అవకాశం కల్పించాలి

గార్ల: గార్ల మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పదేళ్లుగా కృషి చేసిన తనకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని మంగళవారం ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వాకాటి శ్రీహరికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు దరఖాస్తును అందజేశారు.

గద్దెనెక్కిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

సాక్షి ఎఫెక్ట్..

గూడూరు: మండల కేంద్రం నుంచి కేసముద్రం వైపు వెళ్లు ప్రధాన రహదారి పక్కన బొల్లెపల్లి వద్ద 'ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్' అనే కథనం సోమవారం 'సాక్షి' దిన పత్రికలో ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనంపై వెంటనే స్పందించిన విద్యుత్ అధికారులు రోడ్డుకు దగ్గరగా ఏర్పాటు చేసిన గద్దెకు కొంచెం దూరంలో ఎవరికీ ప్రమాదం జరగకుండా ఉండేందుకు మరో పెద్ద గద్దె ఏర్పాటు పనులు సాయంత్రం మొదలు పెట్టారు. మంగళవారం పనులు పూర్తి కాగానే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పైన ఏర్పాటు చేశారు. ఈ దృశ్యాన్ని గమనించిన రైతులు, గ్రామస్తులు కంచె ఏర్పాటు చేయమని చెప్పినా పట్టించుకోలేదు, పత్రికలో రాగానే గద్దెనెక్కించారని చర్చించుకోవడం విశేషం.



నిన్న ఇలా..



నేడు ఇలా..

సమయపాలన పాటించని ఉపాధ్యాయులు



ఎంఈఓ కుర్శీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

డోర్నకల్: సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్య తీసుకోవాలని డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు మాళోత్ శాంతకుమార్ కోరారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మంగళవారం డీఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎంఈఓ కుర్శీకి వినతిపత్రం అందించి ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా శాంతకుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న వారిలో ఎక్కువ మంది దూరప్రాంతాల నుంచి ప్రయాణిస్తూ ప్రార్థనకు కూడా హాజరు కాకుండా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భూక్యా శ్రీకాంత్, బోడ శ్యాంకుమార్, ప్రభాస్, సీతారాం పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపించాలి

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ పట్టణంలోని ఇందిరాగాంధీ సెంటర్‌లో చిరువ్యాపారుల షాపులను అధికారులు తొలగిస్తున్నందున ప్రత్యామ్నాయ స్థలాన్ని చూపించాలని సీపీఐ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. షాపుల తొలగింపును అడ్డుకుని చిరువ్యాపారులతో కలిసి మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ అధికారులే షాపులు వేయించి రిబ్బన్ కట్ చేసి, మళ్లీ మున్సిపాలిటీ అధికారులే కూల్చివేతలకు దిగడం సరికాదన్నారు. చిరువ్యాపారులపై అధికారులు చేస్తున్న తీరు దారుణమన్నారు. నెల రోజుల్లో ప్రత్యామ్నాయం చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, కొండమీది రవి, కవిత, శ్రీధర్, యాకుబ్‌పాష, రహీం, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న అజయ్‌సారథిరెడ్డి

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మహబూబాబాద్ రూరల్: వాహనాన్ని తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ ఎస్సై

మహబూబాబాద్ రూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని ట్రాఫిక్ ఎస్సై సీహెచ్.అరుణ్ కుమార్ కోరారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో మంగళవారం సాయంత్రం ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతి వాహదారుడు వాహనాలకు సంబంధించిన అన్నిపత్రాలను దగ్గర ఉంచుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణం ద్వారా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు.

మద్యం తాగి వాహనాలు నడపరాదు

చిన్నగూడూరు: నిబంధనలకు విరుద్ధంగా మద్యం తాగి వాహనాలు నడపరాదని ఎస్సై ప్రవీణ్‌కుమార్ వాహనదారులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రం శివారులోని జయ్యారం క్రాస్ రోడ్డు వద్ద ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సోమన్న, మంగ్యా, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీత్లాభవాని వేడుకలు



గార్ల: అమ్మవారి వద్దకు ఊరేగింపుగా వెళ్తున్న బంజారాలు

గార్ల: మండలంలోని తిర్లాపురం గ్రామంలో సీత్లాభవాని వేడుకను బంజారాలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. సీత్లాభవాని మాతకు పాయసం నైవేద్యంగా పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

గంగారం: గంగారం మండలంలోని తిరుమలగండి గ్రామంలో సీత్లా భవాని వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు.

ప్రభుత్వ గుట్ట భూమి కబ్జాకు యత్నం..

మరిపెడ రూరల్: మరిపెడ మండలం వీరారం రెవెన్యూ పరిధిలోని కొందరు ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం రాళ్లు తొలగిస్తున్న వాహనాన్ని అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. వీరారం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 301లో 29ఎకరాల గుట్ట, రాళ్లతో కూడిన ప్రభుత్వ భూమి కలిగి ఉంది. ఈ గుట్టకు లాలుమియా అనే వ్యక్తి కొంత కాలంగా రాళ్లను కొట్టుకుంటు జీవనాన్ని సాగిస్తున్నాడు. ఓ వ్యక్తి ఎలాగైన ఈ భూమి ఆక్రమించుకోవాలన్న దురుద్దేశంతో రాళ్లు కొట్టే వ్యక్తితో కలిసి ఇద్దరు కబ్జాకు ప్లాన్ చేశారు. మూడు రోజులుగా గుట్టుచప్పుడు కాకుండా ఈటాచ్ వాహనంతో రాళ్లు తొలగించే పనులు చేపట్టారు. సమాచారం మేరకు విషయం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది వినయ్, గణేశ్‌లు సంఘటన స్థలానికి చేరుకొని ఈటాచ్ సీజ్ చేసి, రాళ్లు కొట్టే పనులు నిలిపివేశారు. తహసీల్దార్, తొర్రూరు ఆర్డీఓ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.